# నిష్కామకర్మ

తన తండ్రి చావు బతుకుల్లో ఉన్నాడని తెలియగానే శోభనాద్రి అంతస్సు ఒక్క పెట్టున జయధ్వానం చేసింది. "చస్తాడు, ముసలాడు ! వాళ్ళ ఊరికి పీడ వదలిపోతుంది. భూ భారం తీరిపోతుంది. ప్రపంచంలో ఉన్న ప్రాణవాయువు పరిశుద్ధం అవుతుంది!"

ఈ జయధ్వానం వినగానే శోభనాద్రికి ముచ్చెమటలు పోసినై. అతనికి సిగ్గుకూడా కలిగింది. తనకు అంత నీచమైన ఆలోచన రావటమేమిటి ?

ఎందుకంటే శోభనాద్రికి రెండు అంతరాత్మలున్నై. ధైర్యం కలవాడికి ఒకటే అంతరాత్మ ఉంటుంది. పిరికివాడికి మాత్రం రెండు ఉంటై. శోభనాద్రి అమిత పిరికివాడు.

శోభనాద్రి రెండో అంతరాత్మ, "నీ ధర్మం మరవకు. ఆయన కర్కోటకుడు కావచ్చును. నీ జీవితాన్ని ధ్వంసం చేసి ఉండవచ్చును. కానీ నీ తండ్రి. తండ్రి అనే ప్రేమ నీకు లేకపోయినా ఇబ్బంది లేదు. నీ ప్రవర్తను జాగ్రత్తగా కాపాడుకో. విధి నెరవేర్చు. నీ తండ్రికి ద్రోహంచేసే ఆలోచనచేసి నీకు నువే ద్రోహం చేసుకోకు?" అంటున్నది.

ఒక వారం రోజులు సెలవుపెట్టి శోభనాద్రి తండ్రిని చూడటానికి రైలు దేరాడు. రైలులో కూర్చున్నది లగాయతు ఇదే ఆలోచన.

తన తండ్రి తన జీవితాన్ని కాలమేఘం ఆవరించి, ఎక్కడా చిన్న సూర్య కిరణం ఎరగకుండా చేశాడు తనను. తనకు బుద్ధితెలియక పూర్వంనించి కూడా తను తన ఆనందంకోసం ఒక్కపనిచేసి ఎరగడు. పోనీ తండ్రి అయినా ఆనందిం ఛాడా? ఊరికే మెప్పయినా వచ్చిందా? కనీసం సమ్మతి అయినా ? ఒక్కనాడు లేదు. క్రియకు తను ఆయన ఇష్టానికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తూ వచ్చినట్టే అయింది. ఆ విధంగా తను రెంటికీ చెడ్డాడు.

తన ఇష్టాయిష్టాలను చంపుకున్నందుకు తండ్రి చేసిన బహుమానం ఏమంటే తన బి.ఏ. చదువు మొగ్గలో తుంచటమూ, పోయి సంపాదించుకోమని ఇంటో నించి తరమటమూనూ! ఆ గోడౌను కీపరు ఖాళీ వచ్చినప్పుడు తను కష్టపడి అంత మంచి శిపారసు తెచ్చుకున్నా తండ్రి సెక్యూరిటీ కట్టనని అది కాస్తా పాడు చేశాడు- భ్రష్టుడు !

సంవత్సరానికి ఇరవైపుట్ల బొప్పునవచ్చే ఆస్తి సంపాదించాడు, ఉద్యోగంలో ఉన్న రోజుల్లో రెండు చేతులా లంచాలుపట్టి ! అదంతా ఎట్లా ఖర్చుచేస్తాడో ఏమో.

ప్రతిదానికీ డబ్బు లేదంటాడు. గర్భదరిద్రులైనా అనుభవించేటప్పు డనుభవించి మాదేటప్పుడు మాడతారు.

ఎంత పాపిష్టివాళ్ళను కూడా ఎవరో ఒకరు ఎప్పుడో ఒకప్పుడు "అయ్యో ! పాపం!" అంటారు. తన తండ్రిని లోకం పాపిష్టి వాడికింద చూడకపోవచ్చును కాని "అయ్యో ! పాపం !" అనాలని మాత్రం ఎవరికీ ఆయన విషయమై ఆలోచనపోదు. తన జీవితపు ఇతర అసభ్యతలకు తోడు ఇటువంటి తండ్రి !

తను ఎట్లా తిండిలేక మాడాడో, ఎవరెవరి కాళ్ళు పట్టుకున్నాడో, ఎవరెవరిని ప్రాధేయపడి, ఎంత కష్టంమీద ఈ గుమాస్తాగిరీ ఈ పాతిక రూపాయల జీతమూ సంపాదించాడో, తన తండ్రికి ఏం తెలుసు ?

ఏమైతే ఏం. ఇక తన కష్టాలు గట్టెక్కినట్టే. ఈ పాతిక తనకు సరిపోతై: ఇందులో ఐదారు మిగులుతై కూడాను. తనకు కిల్లీకూడా అవసరంలేదు కదా ! ఇక తన తండ్రి తననేం బాధపెట్టగలడు ? తను ఒక వందరూపాయలు వెనక వేసుకోగలిగాడు కూడానూ. ఆ వందా ఖర్చుపెట్టి పెళ్ళిచేసుకుంటే పాతిక రూపాయలమీద ఇద్దరూ హాయిగా బతకవచ్చును. ముందు ముందు పిల్లలు పుడతారూ? కానీ కాలం ఎప్పుడూ ఒక విధంగానే ఉంటుందా ?

శోభనాద్రి తండ్రిని చూశాడు. ఆయనకు నంజు వ్యాధి. వైద్యంగాని, పథ్యంగాని ఏమీలేదు. కొడుకును చూడగానే తల్లి ఆవురుమని ఏడ్చింది. ఆవిడ గర్భవాసాన పాపం, లేకలేక ఒక్క కొడుకు.

"ఏమిటమ్మా ! ఆయనకు వైద్యం ఎందుకు చేయించటం లేదూ?" అన్నాడు శోభనాద్రి.

"ఏమో, మీ నాన్నకు అశ్రద్ధ. పెత్తనంలో వచ్చే జబ్బులు నయమయిందాకా నమ్మకమేమిటి, నాయనా? ముందు వైద్యులకు మాత్రం బోలెడంత పొయ్యాలి !"

శోభనాద్రి తల తిరిగి పోయినట్టయింది. తన తల్లి వైధవ్యాన్ని అటువంటి వేదాంతంతో ఎదుర్కొంటున్నదా ? ఇంటో రుగ్మత ఆమెకుగాని తన తండ్రికిగాని ఈషణ్మాత్రం, మీద ఈగ వాలినట్టయినా లేదా ? తను మాత్రం అపరిపూర్ణమైన ఆరోగ్యాన్ని సహించలేడు.

అతను వెంటనే ఇల్లు బయలుదేరి వెళ్ళి మంచి డాక్టరును పిలుచుకు వచ్చాడు. డాక్టరు రోగిని పరీక్షించి "నయం కావచ్చును వైద్యం చేదాం !" అన్నాడు. సరే మందిస్తూ ఉండమన్నాడు శోభనాద్రి.

డాక్టరు వెళ్ళిపోగానే తండ్రి కొడుకుమీద ఎగిరిపడ్డాడు. "ఈ డాక్టర్లు బోలెడంత డబ్బు కాజేస్తారు. ఏమిటి వాళ్ళు చేసే వైద్యం, వాళ్ళ మొహం ?"

"మంచాన పడి ఉన్న వాడివి పడివుండక తర్కించ వస్తావేమిటి ? నేనిక్కడ ఉన్నంతసేపూ నాయిష్ట ప్రకారం నడవాలిసిందే" అని శోభనాద్రి బిగ్గరగా అరిచాడు.

అతనికి తండ్రిమీద కోపం కంటే ఆయన్ను చూస్తే ఆశ్చర్యం ఎక్కువ

గలిగింది. ఆయన మనస్తత్వం ఏమిటో అతను ఊహించ లేకపోయినాడు. డబ్బు కన్న ఇంకేమీ ఆయనకు ఎక్కువగా కనిపించదా? తన ప్రాణంకూడా? ప్రాణం పోతే డబ్బేం చేసుకుంటాడు? తనకు డబ్బుకన్న తక్కువైనవి బహుకొద్దిగా కనిపిస్తై. ఇద్దరు సామాన్య మనుష్యుల దృష్టిలో ఇంత తేడా ఏమిటి?

తను వెళ్ళిన మరుక్షణం డాక్టరును ఇంట్లో అడుగు పెట్టనివ్వడు తండ్రి. శోభనాద్రి ఒక నెలరోజుల సెలవుకోసం రాశాడు. మూడోరోజుకు తిరిగి సమాధానం వచ్చింది — పిలుపడదనీ, వారం కాగానే బయలుదేరి రమ్మనీ. జీతం లేకుండానైనా సరే శెలవిప్పించమని ప్రాధేయపడుతూ శోభనాద్రి మళ్ళీ ఉత్తరం రాశాడు. జవాబు లేదు.

తండ్రి మందులకూ ఇంజక్షనులకూ శోభనాద్రి తన డబ్బే వాడుతున్నాడు. మొత్తంమీద రోగం తిరుగు మొహమైంది. డాక్టరు కూడా సంతోషించాడు.

"ఇంత త్వరలో రోగం దారికి వస్తుందని నేను నా అంతరాత్మలో అనుకోలేదు" అన్నాడు డాక్టరు.

"వాళ్ళ డబ్బు గుంజటానికి అట్లాగే అంటారులే!" అన్నాడు తండ్రి.

శోభనాద్రి నెలాఖరుకు జీతము, ఉద్యోగం ఊడిన వార్తా వచ్చినై. అతడు కన్నీళ్ళు ఆపుకోవటం దాదాపు అసంభవ మయింది. తనకెందుకీ పెంట? తను అతి ప్రయత్నంమీద నిలవచేసిన డబ్బు అయిపోతున్నది. తండ్రికి సొంతంగా నయమయ్యేటప్పటికి ఒక కానీ మిగలదు. ఉద్యోగం ఊడింది. మళ్ళీ కడుపు మాడటమూ, ఆశ్రయింపూ, అవమానమూ, ఇంకొక బానిస తొత్తు నౌకరీనీ!

"ముసలాణ్ణి ఎందుకు చావనివ్వక పోయినావు? సంవత్సరానికి ఇరవై పుట్లు! స్వేచ్ఛ! తగుదునమ్మా అని ఏమని వచ్చి ఆ ముసలి ప్రాణానికి అడ్డుపడ్డావు? ఇవాళ నంజు నయం చేశావు, రేపు ఏ రోగమూ లేకుండా చస్తాడు; ఆపుతావా?" అన్నది ఒక అంతరాత్మ.

"ఏమయితేనేం? ఒక ప్రాణం దక్కించావు. నీ చేతిలో లేకుండా పొయ్యే ప్రాణమూ, నీ ఎదుట నిష్కారణంగా పొయ్యే ప్రాణమూ ఒకటేనా? ఆయన్ను చావనిచ్చి ఉంటే నీ ఆత్మగౌరవం, నీ వ్యక్తిత్వం దక్కి ఉండునా? నీ వ్యక్తిత్వం ఎక్కువా, ఇరవై పుట్లెక్కువా? నీ వ్యక్తిత్వం కోసం నువ్వు ఒకప్పుడు అన్నిరకాల బాధలూ, అవమానాలూ సహించిన వాడివికావా? అప్పటికీ ఇప్పటికీ తేడా ఏముంది?" అన్నది మరొక అంతరాత్మ.

ముద్రణ : ?

ప్రచురణ : ఇల్లరికం కథల సంపుటిలో
యువ కార్యాలయం : తెనాలి, మార్చి 1939